క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం రూరల్, అర్బన్ ప్రాంతంలో సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో గురు, శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ జి.యజ్ఞేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గురువారం ఇచ్ఛాపురం రూరల్ ఏరియా హరిపురం, తేలుకుంచి, మండపల్లి, రత్తకన్న, జగన్నాధపురం, మశాఖపురం గ్రామాలకు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, శుక్రవారం ఇచ్ఛాపురం పట్టణం, రూరల్ పరిధిలో బెల్లుపడ, బెల్లుపడ కాలనీ, కండ్రవీధి, గొల్లవీధి, వి.కె.పేట, రత్తకన్న, మండపల్లి, దాసన్నపేట, కస్పావీధి, పురుషోత్తపురం, కేదారిపురం, ఎ.ఎస్.పేట, ముచ్చింద్ర గ్రామ పరిసర ప్రాంతాలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సజ్జలను కలిసిన అన్వేష్



సజ్జలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అన్వేష్

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ప్రత్తి అన్వేష్ బుధవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రభుత్వ పరంగా క్రైస్తవులకు జరుగుతున్న అన్యాయం, క్రైస్తవులపై దాడులను ప్రస్తావించినట్లు అన్వేష్ తెలిపారు.

అప్పయ్యదొర వర్ధంతి రేపు

పలాస: పార్లమెంటు మాజీ సభ్యులు హనుమంతు అప్పయ్యదొర 11వ వర్ధంతిని కాశీబుగ్గలోని అతని విగ్రహం వద్ద శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యుడు హనుమంతు రామ్‌మోహన్‌దొర తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి అతని అభిమానులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చేతివృత్తుల విభాగ అధ్యక్షునిగా వైకుంఠరావు



తెల్లి వైకుంఠరావు

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన తెల్లి వైకుంఠరావు వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ చేతివృత్తుల విభాగ అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా విధులు నిర్వహిస్తూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మేదర సంఘం కోశాధికారిగా వైకుంఠరావు వ్యవహరిస్తున్నారు. తనకు పదవిని అప్పగించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా, నియోజకవర్గ పార్టీ నాయకులకు వైకుంఠరావు ధన్యవాదాలు తెలియజేశారు.

యాదవ సంఘం అధ్యక్షునిగా సోమేష్ యాదవ్



నియామక పత్రాన్ని అందుకుంటున్న సోమేష్‌యాదవ్

టెక్కలి: యాదవ సంఘం నియోజకవర్గ అధ్యక్షునిగా టెక్కలికి చెందిన నూనెల సోమేష్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎన్నికలో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడు జి.గురునాథ్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు కృష్ణ యాదవ్, కార్యదర్శి కిల్లాన శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు మురపాల రామారావు, కోనారి మల్లేష్, చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు సోమేష్ యాదవ్ తెలిపారు. టెక్కలి నియోజకవర్గంలో యాదవ సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

రోడ్డు విస్తరించినా తప్పని తిప్పలు!

- డ్రైనేజీపైనే వ్యాపారాలు
- చోద్యం చూస్తున్న పంచాయతీ సిబ్బంది

సంతబొమ్మాళి:

రోడ్లను విస్తరిస్తున్నప్పటికీ ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. కొంతమంది వ్యాపారులు రోడ్డుకు ఆనుకొని ఉండే డ్రైనేజీలను ఆక్రమించుకొని వాటిపై వ్యాపారాలు చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీనికి ఉదాహరణగా ప్రముఖ వాణిజ్య కేంద్రమైన బోరుభద్ర మెయిన్ రోడ్డును చెప్పవచ్చు. ఈ రోడ్డు విస్తరణ చేసిన ఫలితం లేకుండా పోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 30 తీర ప్రాంత గ్రామాలకు కూడలి ప్రాంతమైన బోరుభద్రలో మెయిన్ రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనాలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో ఈ రహదారిని రూ. 2.50 కోట్లతో 50 అడుగులు మేరకు విస్తరించారు. దీనిలో భాగంగా రోడ్డుకి ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించి పైకప్పు వేయడంతో రోడ్డు కష్టాలు తీరుతాయని ప్రజలు భావించారు. అయితే నిర్మాణం చేపట్టిన వెంటనే కొంతమంది వ్యాపారులు డ్రైనేజీలను ఆక్రమించి వ్యాపారులు చేస్తున్నారు. మరికొంతమంది ఇంటి యజమానులు డ్రైనేజీలను వ్యాపారాలు చేసుకొనేందుకు అద్దెకు సైతం ఇస్తుండడం విస్మయం కలిగిస్తుంది. అయితే రోడ్డు



డ్రైనేజీపై అడ్డంగా నిర్మించిన గోడ

ఇరుకుగా మారిందని.. విస్తరణ చేపడితే మళ్లీ పాత పద్ధతిలోనే డ్రైనేజీలు ఆక్రమించి వ్యాపారులు చేస్తున్నారు. డ్రైనేజీలపై కొందరు అక్రమ కట్టడాలు చేపట్టడం, మరికొంతమంది ఆక్రమణలకు పాల్పడుతున్నప్పటికీ పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అల్లాటప్పుడు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి రోడ్డు విస్తరణ చేపట్టడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి డ్రైనేజీపై అక్రమాలు తొలగించాలని కోరుతున్నారు.



డ్రైనేజీని ఆక్రమించి వ్యాపారం చేస్తున్న దృశ్యం

నోటీసులు ఇచ్చాం

డ్రైనేజీలు అక్రమించిన వారికి నోటీసులు ఇచ్చాం. స్థానిక సర్పంచ్‌తో వెళ్లి ఆక్రమణదారులతో మాట్లాడటం జరిగింది. వినకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– రమేష్, పంచాయతీ కార్యదర్శి, బోరుభద్ర

నాయకుల పరామర్శ

టెక్కలి: పోలవరం గ్రామానికి చెందిన ధవళ రమేష్ పిడుగుపాటుతో మృతి చెందాడు. దీంతో అతన్ని కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ తదితరులు బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఓదార్చి సానుభూతి వ్యక్తం చేశారు. పార్టీ మండల కన్వీనర్ హెచ్.వెంకటేశ్వరరావు, నాయకులు సత్తారు సత్యం, చింతాడ గణపతి, గొండేల సుజాత, కిల్లి అజయ్, పేడాడ రమేష్, డి.కూర్మారావు ఉన్నారు.

కవిటి: ఆర్.భైరిపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పిరియా వైకుంఠరావు తల్లి లక్ష్మమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబసభ్యులను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కవిటి ఎంపీపీ కడియాల పద్మ, పార్టీ నాయకుడ ప్రకాష్ పరామర్శించారు. పరామర్శలో పార్టీ నేతలు పిరియా ఆనందరావు, పుల్లట జగదీష్, సనపల శ్రీనివాసరావు, మాదిన శ్రీనివాసరావు, వై నీలయ్య, ధోనియాదవ్, వై సత్యం, కె.దనంజయ్.జల్లు యుగంధర్, కడియాల బాబూరావు, బెందాళం డిల్లిబాబు,బదకల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి: రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కృష్ణదాస్, తిలక్ తదితరులు



కవిటి: వైకుంఠరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న పిరియా విజయ తదితరులు

రెవెన్యూ సేవల్లో జాప్యం వద్దు: జిల్లా కలెక్టర్

టెక్కలి: రెవెన్యూ సేవల్లో ఎటువంటి జాప్యం వద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. టెక్కలి, పలాస రెవెన్యూ డివిజన్లకు సంబంధించి బుధవారం టెక్కలిలో రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో భూ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా మెళియాపుట్టి, వజ్రపుకొత్తూరు మండలాల్లో కుల ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్ చేసే క్రమంలో పూర్తి స్థాయిలో విచారణ చేయకపోవడంపై కలెక్టర్ మండిపడ్డారు. అనంతరం మండలాల వారీగా సమీక్ష నిర్వహించి రెవెన్యూ సేవలపై సలహాలు, సూచనలు అందజేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సహాయ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ప్రత్యేకాధికారి అనురాధ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో అధికారులు

కన్నబాబుకు పరామర్శ

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు తండ్రి సత్యన్నారాయణ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురం నియోజకవర్గ పార్టీ నాయకులు బుధవారం కాకినాడ వెళ్లి కన్నబాబును పరామర్శించారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి నర్తు నరేంద్రయాదవ్, కంచిలి ఎంపీపీ పైలా దేవదాసురెడ్డి, ఇచ్ఛాపురం నియోజకవర్గ యువజన అధ్యక్షుడు నర్తు ప్రేమ్‌కుమార్, కంచిలి మండల పార్టీ కన్వీనర్ వజ్జ మృత్యుంజయ రావు, సర్పంచ్‌లు తడక జోగారావు, కొనపల సురేష్, లడ్డూ కేశవపాత్రో, శ్రీను, సాయి, భాస్కర్ ఉన్నారు.



సత్యన్నారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉద్ధృతంగా సండెమ్మ గెడ్డ ప్రవాహం

- రాకపోకలు బంద్

టెక్కలి రూరల్: నందిగాం మండలం సింగుపురం–హుకుంపేట గ్రామాల మధ్య ప్రవహించే సండెమ్మ గెడ్డ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆ గ్రామాల మధ్య ఉన్న రహదారి ధ్వసమైంది. పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కలిగింది. కాపుతెంబూరు, సింగుపురం, హుకుంపేట, నౌగాం గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగుపురం–హుకుంపేట గ్రామాల మధ్య వంతెన నిర్మాణం చేయాల్సి ఉండగా కేవలం పైపులతో నిర్మాణం చేసి వదిలేశారు. దీంతో ఆ పైపులు నీటి ప్రవాహాన్ని తట్టుకోలేకపోవడంతో రహదారి మరమ్మతులకు గురైంది.



రహదారిపై ప్రవహిస్తున్న నీరు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పొల్లాడ ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు చింత అప్పారావు, గిరధర్, కవీశ్వర్, కె.లక్ష్మీలను గ్రామస్తులు, విద్యార్థులు శుక్రవారం ఘనంగా సత్కరించి గౌరవించారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేసిన సేవలను వక్తలు కొనియాడారు. సర్పంచ్ అట్టాడ గోవిందరావు, మాజీ సర్పంచ్ అట్టాడ రఘుపతిరావు, విద్యా కమిటీ చైర్మన్ ఎ.కోటేశ్వరరావు, హెచ్ఎం పి.హరికృష్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.



సత్కారం పొందిన ఉపాధ్యాయులు

ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామానికి చెందిన సంతోష్ రౌలో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఇదే గ్రామానికి చెందిన డిఫెన్స్ సర్వీస్ అసోసియేషన్ సభ్యులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. పది వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని మృతుడు భార్య సుమిత్ర రౌలోకు బుధవారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు

గణపతి నవరాత్రి ఉత్సవాలు చివరిదశకు చేరుకున్నాయి. ఎనిమిదో రోజైన బుధవారం పార్వతీ తనయుడుకి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వామి వారిని దర్శించుకొని నైవేద్యాలు సమర్పించారు. పలు గ్రామాల్లో సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. అలాగే ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన లాటరీ విజేతలను బంపర్ డ్రా ద్వారా ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. పలుచోట్ల ఉత్సాహంగా సిద్ధివినాయక విగ్రహాల నిమజ్జనాలు చేపట్టారు. లడ్డూ ప్రసాదం వేలంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: తిప్పనపుట్టుగలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



కంచిలి: అర్జునాపురంలో సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు



కవిటి: గొండ్యాలపుట్టుగలో గణేష్ ఉత్సవ్ లాటరీలో బహుమతులు అందుకుంటున్న విజేతలు

కాలువల పరిశుభ్రతపై ప్రజలే బాధ్యత వహించాలి

- ఇళ్ల ముంగిట్లో, కాలువల్లో చెత్త వేస్తే రూ. 5 వేల జరిమానా
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- టెక్కలిలో మురుగు కాలువల పరిశీలన

టెక్కలి:

వీధుల్లో మురుగు కాలువల పరిశుభ్రతపై స్థానికులు బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. అలాగే రోజూ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేయాలని ఆదేశించారు. డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని బైరివీధిలో మురుగు కాలువలను బుధవారం పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులు రోజూ వచ్చి చెత్త సేకరణ చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కాలువలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్థానికులు సామాజిక బాధ్యత వహించాలని సూచించారు. తమ వీధిలో కొత్తగా మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని ప్రస్తుతం, ఇళ్ల ముంగిట్లో మురుగు నీటితో దోమల బెడద వలన ఇబ్బందులు పడుతున్నామని బైరివీధి వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి వద్దకు వచ్చి చెత్త సేకరణ చేయడం లేదని, ఎప్పుడు వస్తున్నారో తెలియడం లేదని స్థానికులు వాపోయారు. అయితే వీధుల్లో కొత్తగా ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న వారంతా చెత్తను కాలువల్లో పడేయడంతో అవి మూసుకుపోయి ఇలా రోడ్లపైకి మురుగునీరు చేరుతుందని కలెక్టర్ స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం కాలువలను పరిశుభ్రం చేస్తామని.. మళ్లీ వారం రోజులు తరువాత వచ్చి పరిశీలిస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. అప్పుడు ఇలా ఇళ్ల ముంగిట్లో, కాలువల్లో చెత్త వేయడం కనిపిస్తే ఒక్కొక్కరికీ ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కాగా జిల్లా కలెక్టర్ టెక్కలిలో ఆకస్మిక పర్యటన చేసి పారిశుద్ధ్యంపై అసంతృప్తి వ్యక్తం చేయడం ఇది రెండోసారి. జిల్లా సహాయ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్, డీపీవో భారతి సౌజన్య, ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, డీఎల్‌డీవో అలివేలు, డీఎల్‌పీవో ఐ.వి.రమణ, తహసీల్దార్ సత్యం, ఈవోపీఆర్‌డీ సింహాద్రి, పంచాయతీ ఈవో ఎ.వి.శ్రీనివాస్ ఉన్నారు.



బైరివీధిలో మురుగు కాలువలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర అధికారులు

ఐదు అంతస్తుల భవనానికి అనుమతులు ఉన్నాయా..

టెక్కలి బైరీవీధిలో పారిశుద్ధ్య నిర్వాహణ పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అదే వీధిలో నిర్మాణం జరుగుతున్న ఐదు అంతస్తుల భవనాన్ని ఆకస్మికంగా పరిశీలించి అవాక్కయ్యారు. పంచాయతీలో పెద్ద అంతస్తుల భవనానికి అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలన చేయాలని పంచాయతీ ఈవో శ్రీనివాస్‌ను ఆదేశించారు.

పరాయి పంచన ఉపాధి కార్యాలయం!

- వసతి సమస్యతో సతమతం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కంచిలి:

గ్రామాలకు రోడ్లు, భవనాల నిర్మాణానికి, వేతనదారులకు పనికల్పించే ఉపాధి హామీ శాఖ సొంత కార్యాలయానికి నోచుకోలేదు. ఉపాధిహామీ శాఖ ఏర్పాటైన నాటి నుంచి కంచిలి మండల సిబ్బంది వసతి సమస్యతో సతమతమవుతున్నారు. అన్ని మండలాల్లో ఉపాధిహామీ, సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఇందిరక్రాంతి పథం శాఖలకు ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో భారత నిర్మాణ రాజీవ్ గాంధీ సేవా కేంద్రం భవనం పేరుతో ప్రత్యేక భవనాలను నిర్మించి, అందులోనే కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఈ మండలానికి కూడా ఈ భవనం మంజూరై దశాబ్దాలు గడిచిపోతున్నా నిర్మాణం పూర్తిచేసుకోలేదు. అసంపూర్తి నిర్మాణంతోనే ఆగిపోయింది. ఈ భవన నిర్మాణానికి పంచాయతీరాజ్‌శాఖ విభాగం రూ. 25 లక్షలు నిధులను మంజూరు చేశారు. ఈ పనులను 2011 సెప్టెంబర్ 24న ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు భవన నిర్మాణాన్ని అసంపూర్తిగానే విడిచిపెట్టేశారు. దీంతో ఉపాధిహామీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే కార్యకలాపాలకు సంబంధించి సమావేశాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోనే చేపడుతున్నారు. ఇక్కడ వసతి సమస్యతో సతమవుతున్నప్పటికీ తప్పని పరిస్థితి. ఈ శాఖకు సంబంధించి కార్యాలయంలో, క్షేత్రస్థాయిలో పనిచేసే వారితో కలిపి 50 మంది వరకు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరే కాకుండా గ్రామస్థాయిలో పనిచేసే మేట్‌లు, వేతనదారులు వివిధ పనుల నిమిత్తం ఈ కార్యాలయానికి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇలా ఈ విభాగం తీవ్రమైన వసతి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. వీరికి నెలకు రెండు నుంచి మూడు సమావేశాలు ఉంటాయి. వీటిని కూడా మండల పరిషత్ సమావేశ మందిరంలోనే నిర్వహిస్తున్నారు. అలాగే ఇందిరా క్రాంతి పథం శాఖకు ప్రత్యేకంగా భవనం ఉన్నప్పటికీ, పూర్తిస్థాయిలో సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేయడానికి వసతి చాలడం లేదు. సమావేశాలు, శిక్షణలు ఏర్పాటు చేయాలంటే వసతి సమస్య ఉండటంతో బయట టెంట్లు వేసి నిర్వహిస్తున్నారు. ఈ రెండు శాఖల వసతి సమస్య పరిష్కారమవ్వాలంటే అసంపూర్తిగా విడిచిపెట్టిన రాజీవ్‌గాంధీ సేవా కేంద్రం భవనం నిర్మాణం పూర్తి చేసి, వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.



అసంపూర్తిగా నిలిచిపోయిన రాజీవ్‌గాంధీ సేవా కేంద్రం భవనం

వసతి సమస్యతో ఇబ్బంది..



మండల పరిషత్ కార్యాలయంలోనే దశాబ్దాలుగా ఉపాధిహామీ శాఖ కార్యకలాపాలు సాగిస్తున్నాం. ఇక్కడ తీవ్రమైన వసతి సమస్యతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నాం. మా శాఖకు సంబంధించి కార్యాలయం నిర్వహణకు రాజీవ్ గాంధీ సేవా కేంద్రం భవనం కేటాయించినప్పటికీ ఈ మండలంలో ఈ భవనం అసంపూర్తి నిర్మాణంతో ఉండటంతో మండల పరిషత్ కార్యాలయంలోనే కార్యకలాపాలు చేపడుతున్నాం.

–జి.ధనుంజయ, ఏపీవో, ఉపాధి హామీ శాఖ, కంచిలి మండలం

అసంపూర్తి నిర్మాణం పూర్తిచేయాలి



రాజీవ్ గాంధీ సేవా కేంద్రం భవనం దశాబ్దన్నర కాలంగా అసంపూర్తి నిర్మాణంతోనే నిలిచిపోయింది. దీని వలన ఉపాధి హామీ, ఇందిరక్రాంతి పథం శాఖల సిబ్బంది వసతి సమస్యతో సతమతమవుతున్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి నిర్మాణాలను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలి.

–పైల దేవదాస్‌రెడ్డి, ఎంపీపీ, కంచిలి మండలం

ఒరిగిపోతున్న విద్యుత్ స్తంభాలు!



టెక్కలి మండలం శాసనం జంక్షన్ వద్ద జాతీయ రహదారికి అనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. పలాస నుంచి టెక్కలి వైపు వచ్చే మార్గంలో ఇటీవల కొత్తగా సంభాలు ఏర్పాటు చేశారు. అయితే పాత విద్యుత్ స్తంభాలను తొలగించక పోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు అవి నేలకు ఒరిగిపోయి ఆందోళన కలిగిస్తున్నాయి. అలాగే కొత్తగా వేసిన స్తంభాలు సైతం ఒరిగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటిని సరిచేయాలని కోరుతున్నారు.

–టెక్కలి రూరల్

కషాయం తయారీపై అవగాహన



ప్రకృతి వ్యవసాయ విధానంలో జిల్లేడు కషాయంతో ప్రయోజనాలున్నాయని ప్రకృతి వ్యవసాయ విధానం ఐసీఆర్‌పీ నెయ్యిల విజయలక్ష్మి అన్నారు. కంచిలి మండలం బొగాబెణి గ్రామంలో రైతు మల్ల విశ్వనాథానికి చెందిన వరి పొలం కోసం జిల్లేడు కషాయం తయారు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా బుధవారం ఆమె చూపించారు. లీడ్ ఫార్మర్స్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

–కంచిలి

సస్యరక్షణ చర్యలు పాటించాలి



ఖరీఫ్ వరి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సోంపేట మండల వ్యవసాయాధికారి బి.నర్సింహామూర్తి అన్నారు. కొర్లాం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి సాగులో యాజమాన్య పద్ధతులు వివరించారు. చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. పోషక యాజమాన్యం పాటించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

–సోంపేట